క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలందుకున్న సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి హుండీ ఆదాయం రూ. 3.68 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి హుండీ లెక్కింపు శుక్రవారం చేపట్టారు. 72 రోజులకు గాను రూ.3,68,572 ఆదాయం వచ్చింది. జ్ఞానాపురం ఎర్నిమాంబ దేవస్థానం కార్యనిర్వహణాధికారి సురేష్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్, శ్రీవారి సేవా భక్తులు రెడ్డి, అప్పారావు, ఆలయ ప్రధాన అర్చకుడు పి. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్యాబ్ ఓనర్లు, డ్రైవర్లు

సీతమ్మధార : జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం ఎనిమిది శాతం కమిషన్ తీసుకుని యాప్‌తో సర్వీసులు నడుపుతుందన్నారు. డ్రైవర్లకు అందులో మూడు శాతం ఇస్తుందన్నారు. ఇక్కడ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌ను అభివృద్ధి చేసి సర్వీసులు నడపాలని.. లేదా ఉబర్, ఓలా ఇతర ఆన్‌లైన్ సర్వీసులన్నీ ఎనిమిది శాతం కమిషన్ తీసుకునే విధంగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ప్రధాన డిమాండ్లపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, లక్ష్మీనారాయణ, పోలునాయుడు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

డాబాగార్డెన్స్: ప్రకాశరావుపేటలోని అర్బన్-2 ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్వాడా కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలామృతంతో చేసిన వంటకాలు ఏ విధంగా తయారు చేయాలో వివరించారు. మిల్లెట్స్, చిరుధాన్యాలు (రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటివి) తదితర వాటి ప్రాముఖ్యత గురించి తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మీలావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానాంబకుమారి, భారతి, మంగమ్మ, చంద్రకళ, అరుణ, మౌనిక, ఆశ వర్కర్ విజయకుమారి పాల్గొన్నారు.

భయం.. భయం


- కూలేందుకు సిద్ధంగా పాతనగరంలోని పలు కట్టడాలు
- ఖాళీ చేయాలని ఆదేశాలిచ్చిన మేయర్, కమిషనర్



పాతనగరంలో గతంలో కూలిన ప్రహరీ



పాతనగరంలో ఇలాంటి పురాతన కట్టడాలు ఎన్నో..



టౌన్‌కొత్తరోడ్డు వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లు

ఎప్పుడో బ్రిటీష్ వారి హయాంలో రూపుదిద్దుకున్న ప్రాంతం విశాఖలోని పాత నగరం. నేడు నగరం సువిశాలంగా విస్తరించినప్పటికీ వన్‌టౌన్ ఏరియాలోని చాలా భాగం ఆధునికతకు నోచుకోలేదు. అక్కడ ఇప్పటికీ వందేళ్లకు పైబడిన కట్టడాలు అనేకం ఉన్నాయి. అటువంటి నిర్మాణాలు ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా కూలుతూ అందులో నివసించే వారి ప్రాణాలు బలిగొంటున్నాయి. తాజాగా రామజోగిపేటలో సంభవించిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తాము తీసుకుంటున్న చర్యలకు స్థానికులు కూడా సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

డాబాగార్డెన్స్: వాతావరణ శాఖ సూచనలతో రెండు రోజుల్లో వర్షాలు కురవనున్నాయి. ఇప్పటికే పాతనగరంలో పలు ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. వర్షం ధాటికి గోడలు నాని ఎప్పుడు కూలుతాయోనన్న భయం గుప్పిట్లో పాతనగర వాసులున్నారు. రెండు రోజుల కిందట 29వ వార్డు పరిధి రామజోగిపేటలో మూడంతస్తుల ఇల్లు కూలింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, మరో ఐదుగురు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అలాగే నెల రోజుల కిందట 30వ వార్డు పరిధి కోడిపందాల వీధిలో గోడ కూలింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. గతంలో ఫిషింగ్ హార్బర్ రోడ్డు లైట్‌హౌస్ వద్ద ఓ ఇంటి ప్రహరీ కూలిన ఘటనలో ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని పాతనగర వాసులు కోరుతున్నారు.

కోకొల్లలుగా శిథిల గృహాలు

విశాఖ పాతనగరంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వాలు నిర్మించిన స్కీం ఇళ్లతో పాటు వాంబే గృహాలు పెచ్చులూడుతున్న సందర్భాలున్నాయి. ఏ పాటి వర్షం కురిసిన వారంతా బిక్కుబిక్కుమంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పాతనగరంలో కోటవీధి, పాతపోస్టాఫీస్, అంబుసరంగు వీధి, చాగంటివారి వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లివీధి, చిలకపేట, పద్మానగర్, తారకరామకాలనీ తదితర ప్రాంతాల్లో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

అధికారులకు ఆదేశాలిచ్చాం



జోన్-4 పరిధిలో ఉన్న ప్రాంతమంతా పురాతన నగరం. అక్కడ చాలా వరకు పురాతన భవనాలు ఉన్నాయి. వాటన్నింటినీ పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న భవనాలను ఆయా ఇళ్ల యజమానులతో మాట్లాడి ఖాళీ చేయించే ప్రయత్నం చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలిచ్చాం.

గొలగాని హరివెంకటకుమారి, నగర మేయర్

పురాతన భవనాల నివేదిక కోరాం



నగరంలో ఉన్న పురాతన భవనాలను గుర్తించి ఒక నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించాం. పురాతన భవనాల యజమానులతో మాట్లాడి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని, లేదా జీవీఎంసీకి తెలియజేసినచో జీవీఎంసీయే తొలగించే ప్రక్రియ చేపడుతుందని తెలిపాం. ప్రమాదపుటంచుల్లో ఉన్న భవనాలు తొలగించాలని అధికారులను ఆదేశించాం.

పి. రాజాబాబు, కమిషనర్, జీవీఎంసీ

క్షయవ్యాధి నిర్మూలన కోరుతూ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ వరకు ర్యాలీ జరిగింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ రెండు వారాలు మించి జ్వరం, దగ్గు, నోటి నుంచి రక్తం పడడం వంటి లక్షణాల వల్ల క్షయవ్యాధి సోకినట్టుగా గుర్తించవచ్చని అన్నారు. జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ క్షయవ్యాధి వల్ల ప్రాణాలు కోల్పోయే శాతం తక్కువ అన్నారు. భయ పడవలసిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ, ఊపిరితిత్తుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ వైద్యులు ఎస్.జీవన్‌రాణి, ఎస్.రమారెడ్డి, సమత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, డ్రగ్స్ ఏడీ చంద్రశేఖర్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్-2గా శ్రీనివాసులు



సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు

జగదాంబ: సబ్‌రిజిస్ట్రార్-2గా శ్రీనివాసులు నియమితులయ్యారు. చౌల్ట్రీ వద్ద ఉన్న ఈ కార్యాలయంలో ఇప్పటి వరకు నిరంజన్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించేవారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లలో అలసత్వం లేకుండా చూస్తామన్నారు. మొదటి రిజిస్ట్రార్‌గా గీతాలక్ష్మి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు జీపీఎస్ వ్యవస్థ తప్పనిసరి



లారీ యజమానులతో సమావేశమైన డీసీపీ-2 కె. ఆనందరెడ్డి

అల్లిపురం: ట్రాన్స్‌పోర్టు లారీలన్నింటిలో తప్పనిసరిగా జీపీఎస్ వ్యవస్థ అమర్చాలని, లోడింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం చేరేంత వరకు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్టు వారు సదరు లారీల ట్రాకింగ్ డేటా భద్రపరచాలని జోన్-2, డీసీపీ కె. ఆనందరెడ్డి కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లారీ ట్రాన్స్‌పోర్టు సంఘాల యాజమాన్యాలతోను, స్టీవ్ డోరింగ్ కంపెనీల ప్రతినిధులతో పోర్టుట్రస్ట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టుట్రస్ట్ కేటాయించిన యార్డుల్లో సంబంధిత సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కంపెనీ యాజమాన్యాలు సూపర్‌వైజర్లను, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే క్రమంలో ఆయా సంస్థలు గత చరిత్ర, నేరచరిత్రను తప్పక పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టీవ్ డోర్స్ కంపెనీ వారు జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలని కోరారు. పోర్టులో షిప్ నుంచి లోడ్ అన్‌లోడ్ చేసిన మెటీరియల్ యార్డ్‌కు పంపించే సమయంలో ప్రతి లారీకి రశీదు అందించి అన్‌లోడ్ అయిందా లేదా అని తనిఖీ చేసుకోవాలన్నారు. వేయింగ్ బ్రిడ్జి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని యజమానులకు తెలిపారు. ఈ సమావేశంలో హార్బర్ ఏసీపీ, హార్బర్ సీఐ, పోర్టుట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం(క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరగనుందన్నారు.

ఇవీ వివరాలు..

- హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్‌లో 200 జూనియర్ కెమిస్ట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 20-26 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు రూ.22,800 జీతం ఇస్తారు.
- పొలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు కంపెనీలో 30 ప్రాసెస్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ/పీజీ/ఏదైనా డిప్లొమా అర్హత కలిగి 20-25 ఏళ్ల లోపు వయసు ఉండాలి. నెలకు రూ.12,000 జీతం ఉంటుంది.
- స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్(సీతంపేట-విశాఖపట్నం)లో 20 టెలీకాలర్స్, 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, 20 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, 25 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు జీతం రూ.12,000.
- క్లోవ్ టెక్నాలజీస్‌లో 15 ఆటో క్యాడ్ పోస్టులకు బీటెక్(సీఎస్ఈ), 22-27 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు అర్హులు. జీతం 13,500. ఇదే సంస్థలో డిప్లొమా లేదా ఏదైనా బీటెక్ చేసిన వారికి డెవలపర్స్ ఉద్యోగానికి అవకాశం ఉంది. నెలకు రూ.13,500 జీతం ఉంటుంది.
- పేజెస్ సంస్థలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డాటా సోర్సింగ్, కమ్యూనికేషన్ పోస్టులను భర్తీ చేస్తారు. సైన్స్ డిగ్రీ/బీ ఫార్మసీ/ఎం ఫార్మసీ/బీఎస్సీ/ఎంఎస్సీ/బీటెక్ కంప్యూటర్స్ కోర్సులు చేసి 30 ఏళ్ల వయసు లోపు ఉన్న వారు అర్హులు. విశాఖలో రూ.16,000, హైదరాబాద్‌లో రూ.18,000 జీతం ఇస్తారు.
- ట్రస్ట్ సర్వీసెస్‌లో ఫిట్టర్, వెల్డర్, ఫ్యాబ్రికేట్, గ్రైండర్స్ హెల్పర్స్ 10 పోస్టులకు ఐటీఐ చదివి 18-48 ఏళ్ల వయసు గల వారు అర్హులు. నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుంది.
- సువర్ణభూమి సంస్థలో మార్కెటింగ్ మేనేజరు పోస్టుకు బీటెక్/ఎంబీఏ అర్హత కలిగి 18-36 ఏళ్ల వయసు గల వారిని తీసుకుంటారు. పది పోస్టులు ఉన్నాయి. నెలకు రూ.17,000 జీతం. ఇదే సంస్థలో 10 టెలికాలర్ ఉద్యోగాలకు 18-36 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జీతం రూ.9,000. అభ్యర్థులు నేరుగా కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయానికి శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావచ్చు. ఆసక్తి గల వారు ncs.gov.in లో పేర్లు నమోదు చేసుకోవాలి.

విశాఖ ఉక్కును పరిరక్షించండి

డాబాగార్డెన్స్: విశాఖ ఉక్కును పరిరక్షించాలని, ఆంధ్రరాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు రాష్ట్ర ఎంపీలకు బహిరంగ లేఖ రాసినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న పార్లమెంట్ సెషన్స్‌లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరోధించి ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేయడానికి ఎలాంటి చర్చ జరగలేదని, జనవరి 30న స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన బహిరంగ సభలో దీన్ని పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అధికార పార్టీ నాయకులు కార్మికులకు హామీ ఇచ్చారన్నారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలుపై పార్లమెంట్ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పార్లమెంట్‌లో పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

30న సీతారాముల కల్యాణం

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈనెల 30న సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ. 216 చెల్లించినట్లయితే వారి పేర్లు, గోత్రనామాలను కల్యాణంలో చదువుతారని దేవస్థానం ఈవో అల్లు జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారికి కల్యాణం లడ్డు, పులిహోర ప్రసాదం, తలంబ్రాలు అందజేస్తామన్నారు. 12 గంటలకు అన్నసమారాధన ఉంటుందన్నారు.

పీజీ క్విజ్ విజేతకు అభినందనలు



డాక్టర్ సృజనకాంత్‌ను అభినందిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : పీజీ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థి డాక్టర్ కొల్లి సృజనకాంత్‌ను శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అభినందించారు. చండీగఢ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 11 నుండి 13 వరకు జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సృజన్‌కాంత్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ భవాని, ప్రొఫెసర్ డాక్టర్ కేవీ లీల, అధ్యాపకులు విజేతను అభినందించారు.

సిప్ మంత్ర యాప్ ప్రారంభం

అల్లిపురం: ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన సిప్ మంత్ర యాప్‌ను అధికారులు ప్రారంభించారు. ద్వారకా బస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రవికుమార్, డీపీటీవో ఎ.అప్పలరాజు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బి.అప్పలనాయుడు, డీసీటీఎం జి.సత్యనారాయణ, ఏటీఎం రాజు పాల్గొని ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడి వారికైనా పార్సిళ్లు పంపవచ్చన్నారు.

అందరిలో మార్పుతోనే సమాజంలో పరివర్తన



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తదితరులు

మహారాణిపేట : ప్రతి ఒక్కరిలో సామాజికంగా మార్పు కలిగినప్పుడే సమాజంలో మంచి మార్పు వస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామాజిక, ప్రవర్తన మార్పు కమ్యూనికేషన్ (ఎస్‌బీసీసీ) సెల్, సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామజిక, ప్రవర్తన మార్పు కమ్యూనికేషన్ సెల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యూనిసెఫ్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెల్ ద్వారా పట్టణ, గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై అవగాహన, కౌమార దశ బాలికల్లో రక్తహీనత, మహిళా రక్షణ , డ్రాపౌట్స్, బహిరంగ మల విసర్జన, వ్యక్తిగత పరిశుభ్రత మొదలైన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, డీఈవో చంద్రకళ, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఎస్‌బీసీసీ సెల్ ప్రతినిధి ఎం.ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

సీఎంకు ధన్యవాదాలు



మహారాణిపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ విశాఖ జోన్ (విశాఖ, విజయనగరం, అనకాపల్లి) మహిళా విభాగం అధ్యక్షురాలు గరికిన గౌరీ శుక్రవారం అమరావతిలో కలిసి తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల గరికిన గౌరీని విశాఖ జోన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించిన సంగతి తెలిసిందే.

రామజోగిపేట బాధితుల నిరసన



డీఆర్‌వోకు వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మహారాణిపేట : రామజోగిపేట ఘటనలో బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ శుక్రవారం బాధితులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన సాకేటి అంజలి (15), సాకేటి దుర్గాప్రసాద్ (17) బీహార్‌కు చెందిన తరల్లా సాహూ (చోటు 28) మృతి చెందారని బాధితులు తెలిపారు. అదే ఘటనలో పలువురు గాయపడ్డారని, వీరు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని బాధితుల తరపున సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రహ్మాన్ తెలిపారు. వీరంతా దినసరి కూలీలన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం అందించాలని కోరారు. అనంతరం డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాధితులు, సీపీఐ నాయకులు పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాంరాం మందిరంలో ఏకాహ సంకీర్తన



కచేరీ నిర్వహిస్తున్న గుడిమెట్ల శారద శిష్య బృందం

డాబాగార్డెన్స్: వేంకటేశ్వరమెట్టలో గల రాం రాం మందిరంలో నిర్వహిస్తున్న సీతారామ కల్యాణ ఏకాహ సంకీర్తనా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మనోరంజని మ్యూజిక్ స్కూల్ గుడిమెట్ల శారద శిష్య బృందంచే సంగీత కచేరీ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం బంగారాజు మాస్టర్, రాములచే శ్రీరామభక్తి గీతాలాపన నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధా రామయ్యమ్మ తెలిపారు. ఈ సంకీర్తన మహోత్సవాలు ఏప్రిల్ ఒకటి వరకు కొనసాగుతాయని తెలిపారు. 30న ఉదయం 9.30 గంటల నుంచి సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి నారాయణ సేవ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఏవీఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



పచ్చదనాన్ని పెంపొందించే పోస్టర్‌తో విద్యార్థులు

డాబాగార్డెన్స్: జి-20 సదస్సుకు సంబంధించి ఏయూలో నిర్వహిస్తున్న యూనివర్శిటీ కనెక్ట్ యంగేజింగ్ యంగ్ మైండ్స్ ప్రీ ఈవెంట్స్ సెలబ్రేషన్స్‌లో ఏవీఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాల విద్యార్థులు అద్భుతమైన పోస్టర్ రూపొందించారు. పచ్చదనం పెంపొందించి, కాలుష్యాన్ని నివారించేందుకు పులువురు విద్యార్థులు పలు పోస్టర్లు రూపొందించి ప్రతిభా పాటవాలు చాటుకున్నారు. ఏవీఎన్ కళాశాలకు చెందిన బీఎస్సీ సీబీజెడ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దుర్గాప్రసాద్, పి. శ్రావణసంధ్య, ఎస్. రమణమూర్తి, ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న భగవాన్ పాత్రో పోస్టర్ డిజైనింగ్, ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న ఆర్. ప్రశాంతి వ్యాసరచనలో మొదటి స్థానం సాధించింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్‌భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, ఇంగ్లీషు విభాగం విభాగాధిపతి పైడి రజని, అర్చన, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించారు.

రంజింపజేసిన సంగీత విభావరి



కళాకారులను సత్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, బైపా అరుణకుమార్ తదితరులు

అల్లిపురం: రస రాగ మాధురి, శృతిలయ సంగీత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యాన్ ఈవినింగ్ ఇన్ పారిస్ శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి రంజింపజేసింది. కార్యక్రమాన్ని సెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన కళాకారులను సత్కరించారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో ఎమ్మెస్ మాధవ్, జ్యోతి పాడిన ఈ ఎర్ర గులాబీ విరిసింది, ప్రభాకర్, కళ్యాణి పాడిన దిల్ తడప్ తడప్‌కే, మెలోడీ సత్యనారాయణ, సత్యశ్రీ పాడిన కొండ కోన పాలైన పాటలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బైపా అరుణకుమార్, సినీ నటుడు ఆన్ యాదకుమార్, ఎంవీ రాజశేఖర్, కళారంగ ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లికా సినీ మాధుర్య స్వరాలు

డాబాగార్డెన్స్: మల్లికా మాధుర్య స్వరాలు కల్చరల్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో సాంస్కృతిక సంబరాలు పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు నన్నపనేని మల్లికా చౌదరి తెలిపారు. సంస్థ కార్యాలయంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికా చౌదరి మాట్లాడుతూ విశాఖలో విశేష సేవలందిస్తున్న వ్యక్తులను సత్కరిస్తామన్నారు. సంగీత ప్రియులు, ప్రముఖులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏడీసీపీ మహ్మద్ ఖాన్, కళా సంస్థల ప్రతినిధులు కొణతాలరాజు, జేఎంఆర్ నెహ్రూ, సంస్థ గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ పండా, బొమ్మిడి సత్యనారాయణ, కల్లూరి సింహాచలం , కేఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పోస్ట్‌మార్టం కాలేదు..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు పరిధి రామజోగిపేటలో బుధవారం అర్ధరాత్రి తర్వాత నేలకొరిగిన మూడంతస్తుల భవనంలో మృతి చెందిన బీహార్‌కు చెందిన చోటు, విజయనగరం జిల్లాకు చెందిన సాకేటి దుర్గాప్రసాద్, సాకేటి అంజలి మృతదేహాలకు అనివార్య కారణాల వల్ల శుక్రవారం నాటికి కూడా పోస్టుమార్టం కాలేదు. శనివారం ఉదయం పోస్టుమార్టం చేయనున్నట్టు మృతుల బంధువులు 'సాక్షి'కి తెలిపారు. ఇదిలా ఉండగా ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాకేటి కల్యాణి, సాకేటి రామారావు, సన్నాపు కృష్ణ, రోజారాణి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.